ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి: బీజేపీ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: పట్టణంలో ప్రభుత్వానికి చెందిన సర్వే నంబర్ 626బై1లోని భూమిని నాలుగైదు రోజులుగా కొందరు చేస్తున్న కబ్జా ప్రయత్నాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ తదితరులు తహసీల్దార్ రవీందర్ దత్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ భూమిలో వెంటనే బోర్డులు పాతడంతో పాటు కబ్జాకు ప్రధాన కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోతే తామే రంగంలోకి దిగి సర్కారు స్థలాన్ని కాపాడుకుంటామన్నారు. స్పందించిన తహసీల్దార్ రవీందర్‌దత్ మాట్లాడుతూ... త్వరలో పూర్తిస్థాయిలో సర్వే చేయించి ప్రభుత్వ స్థలాన్ని కాపడుతామని స్పష్టం చేశారు.

పోలీసులకు ఫిర్యాదు...

626బై1 పక్కనే ఉన్న ప్రైవేటు స్థలం ఉన్న వెంచర్ నిర్వాహకుడు కేశవులునాయుడు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఆర్ఐ కృష్ణ గురువారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న పుస్తకాల నర్సింగ్‌రావు

మణికొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే ప్రజా పోరాటాలకు సిద్ధం అవుతామని సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. గురువారం నార్సింగిలో గండిపేట మండల కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు, రైతు భరోసా, నిరుద్యోగ పింఛన్, మహాలక్ష్మి లాంటి పథకాలను అమలు చేయటంలో విఫలం అయ్యిందన్నారు. మూసీ వెంట ఉన్న ప్రజలకు పునరావాస సౌకర్యాలను కల్పించిన తరువాతే వారిని తరలించాలన్నారు. వారిని బలవంతంగా తరలిస్తే వారి తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. నవంబర్‌లో ప్రజా సమస్యలపై సమావేశాలు నిర్వహించి తహసీల్దార్, జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... ప్రభుత్వం కనీస వేతనాల గురించి విడుదల చేసిన జీవోను అమలు చేయాలన్నారు. నిర్మాణ రంగ కార్మికుల హక్కులను యాజమాన్యాలు కాలరాస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో అన్ని తరగతుల కార్మికుల సమస్యలపై సర్వే చేయటంతో పాటు పోరాటాలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా దళిత హక్కుల సంఘం నియోజకవర్గ నాయకుడు బండి నరసింహాను పార్టీలో చేర్చుకున్నారు. కౌన్సిల్ సభ్యులు రాఘవేందర్‌గౌడ్, భిక్షపతి, కృష్ణ, ప్రభాకర్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా ఉంటాం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


అత్తాపూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

అత్తాపూర్: మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని తిప్పికొట్టాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూసీ బాధితులకు అండగా ఉండేందుకు భారతీయ జనతా పార్టీ ముందుండి పోరాడుతుందని ఈటల పేర్కొన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని టీకేఆర్ నగర్, భరత్‌నగర్‌లో హైడ్రా బాధితులను గురువారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయాల శంకర్‌తో కలిసి పరామర్శించారు. ఎవరూ అధైర్య పడొద్దని కలిసికట్టుగా ఉద్యమాలు చేద్దామని ఎంపీ ఈటల స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ శివారులో ఉన్న మురికి నీరంతా వచ్చి మూసీలో కలుస్తున్నా పట్టించుకోలేదన్నారు. మురుగునీటిని పైప్‌లైన్ ద్వారా ఎస్‌టీపీలు నిర్మించి ఫిల్టర్ చేసి మూసీలోకి వదిలిపెట్టాలన్నారు. ఈ ప్రక్రియ ఎక్కడా మొదలు పెట్టకుండా కట్టుకున్న ఇళ్లను కూలుస్తామంటూ ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నదన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, నేతలు కొమురయ్య, మల్లారెడ్డి, మల్లేష్‌యాదవ్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించాలి


కౌన్సిలర్‌ను సత్కరిస్తున్న ప్రజలు

మణికొండ: కాలనీలలో ప్రజలు సామూహిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాళ్లు ఇతరత్రా వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మణికొండ మున్సిపాలిటీ 7వ వార్డు నెక్నాంపూర్ కౌన్సిలర్ బి.పద్మారావు అన్నారు. గురువారం ఆయన డాక్టర్ వైఎస్సార్ సెక్రటేరియట్ కాలనీలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ రెండవ అంతస్తు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రతి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. స్థలాలు ఉన్న కాలనీలలో ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, మిగిలిన వెంకటేశ్వర కాలనీలోను త్వరలోనే చేపడతామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదరిశ దేవరాజు, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారావు, కార్యదర్శి నాగేంద్రప్రసాద్, మాజీ ఉపాధ్యక్షుడు నర్సింహారావు, నాయకులు బాబా, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన దళిత సంఘాల నాయకులు


పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పుతున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన దళిత సంఘాల నాయకుడు బండి నరసింహా తదితరులు గురువారం సీపీఐలో చేరారు. సీపీఐ కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగ్ రావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య తదితరుల సమక్షంలో ఆయన తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి నరసింహ మాట్లాడుతూ... తనపై ఎంతో నమ్మకంతో పార్టీలో చేర్చుకున్న పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని వెల్లడించారు. నాయకులు స్వామి, రాఘవేందర్ గౌడ్, భిక్షపతి, కృష్ణ, ప్రభాకర్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు


తనిఖీలు చేపడుతున్న ఆర్‌జీఐఏ పోలీసులు

శంషాబాద్: శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా గురువారం రాత్రి శంషాబాద్ పట్టణంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని దేవాలయాలు, వివిధ దుకాణాలు, ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. అనుమానిత వస్తువులు, వ్యక్తులకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్నైనా పోలీసులకు వెంటనే తెలపాలని స్థానికులకు సూచించారు. శాంతిభద్రతల్లో పౌరులు భాగస్వాములు కావాలన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా

- అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాల తొలగింపు
- స్వల్ప ఉద్రిక్తతల నడుమ తొలగింపు ప్రక్రియ పూర్తి
- తిరిగి ఏర్పాటు చేస్తే చర్యలు తథ్యమన్న అధికారులు
- వారంలో మరోసారి కూల్చివేతలంటూ స్పష్టీకరణ


మధుబన్ కాలనీ పుత్ పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: పుత్‌పాత్‌లపై అక్రమంగా వేసిన డబ్బాలపై కొరడ ఝులిపించిన రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై ఇరువైపుల పుత్‌పాత్‌లపై అక్రమంగా వేసుకున్న డబ్బాలను తొలగించారు. కొన్ని సంవత్సరాలుగా ప్రధాన రహదారిపై ఇరువైపుల ఉన్న పుత్‌పాత్‌లపై కాళీ స్థలంలో ఒకరిని చూసి మరోకరు అక్రమంగా ఇనుప డబ్బాలను వేసి వ్యాపారం చేసుకుంటున్నారు. దీంతో రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు అందిన ఫిర్యాదులతో గురువారం భారీ పోలీసు బందోబసు మధ్య అక్కడ వెలిసిన అక్రమ నిర్మాణాలపై జేసీపి సహాయంతో తొలిగించారు. రోడ్డుపై అక్రమంగా నిర్మించిన మెట్లను సైతం కూల్చివేశారు. కాలనీలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నా సుమారు 20 డబ్బాలను తొలగించారు. రోడ్డుపై వేసిన మరో 20 షెడ్లను కూల్చివేశారు. కొందరు అక్రమంగా వేసుకున్న షెడ్లను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై అక్రమంగా డబ్బాలను వేసి వ్యాపారం చేయరాదు. వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా డబ్బాలను ఏర్పాటు చేసుకుంటే ఎప్పటికైనా కూల్చివేతలు తప్పదు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. వచ్చే వారంలో మరోసారి కాలనీ ప్రధాన రహదారిపై వేసిన డబ్బాలను తొలగిస్తాము. వ్యాపారులు రోడ్డుపై వేసిన డబ్బాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి.

– శ్రీధర్, రాజేంద్రనగర్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్


చెత్త వేరు చేసే పద్ధతులను వివరిస్తున్న సిబ్బంది

చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ పరిశీలన

మణికొండ: ఇంటింటి నుంచి వస్తున్న చెత్తను తడి, పొడిగా సేకరించటంతో పాటు వాటిని వర్మి కంపోస్టు ఎరువుగా, సాలిడ్ వేస్ట్ చెత్తగా వేరు చేసి ఆదాయం సమకూర్చుకోవటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే విధానాన్ని సీడీఎంఏ గౌతమ్ ఆదేశాలతో పలు మున్సిపాలిటీల కమిషనర్లు గురువారం పరిశీలించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఉన్న చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ వద్ద తడి, పొడి, హానికారక చెత్తను వేరు చేసే పద్ధతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలు మున్సిపాలిటీల కమిషనర్‌లతో పాటు నార్సింగి మున్సిపాలిటీ డీఈ నరేష్, మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రియకాలనీలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నటరు. షుగర్, లివర్, చర్మ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి అతి ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించటంతో పాటు మందులను ఇస్తామని డాక్టర్ ప్రభు లైఫ్ మల్టీస్పెషాలిటీ క్లినిక్స్ చైర్మన్ డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి వెల్లడించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రియకాలనీలోని క్లినిక్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ వైర్లకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 1 నుంచి 13 వరకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. బాలాజీనగర్, సెక్రటేరియట్ కాలనీ రోడ్డు నెంబర్ 1 నుంచి 15 వరకు, అలకాపూర్ సెక్టార్ 2ఏ, 2బీ, 2సీ, 2డీలలో మధ్యాహ్నం 12నుంచి 3 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏడీ వివరించారు.

సెకండ్ ఏఎన్ఎంలను పర్మనెంట్ చేయాలి

శంషాబాద్: రెండవ ఏఎన్ఎలను పర్మనెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ హోటల్‌లో జరిగిన రెండవ ఏఎన్ఎం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా వైద్య రంగంలో విలువైన సేవలందిస్తున్న రెండవ ఏఎన్ఎంల విషయంలో ప్రభుత్వాల వైఖరి మారడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఏళ్లుగా సర్వీసులో ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేకపోవడంతోపాటు సరైన వేతనాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏఐటీయూసీ నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ... సెకండ్ ఏఎన్ఎంల శ్రమలను దోచుకోవడం ప్రభుత్వాలకు అలవాటుగా మారిందన్నారు. నవంబర్ 17న శంషాబాద్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీని ఆపాలని ఫిర్యాదు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణ పనులను నిలిపివేయాలని స్థానిక నాయకుడు ప్రభాకర్ రెడ్డి గురువారం రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దాదాపు 600 గజాల ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి కబ్జా చేసి నిర్మాణాన్ని ప్రారంభించాడని తెలిపారు. గతంలో జీవో నంబర్ 59 ప్రకారం సదరు ప్రభుత్వ స్థలాన్ని క్రమబద్ధీకరించుకున్నాడన్నారు. ఆ స్థలంలో నిర్మాణాన్ని పూర్తి చేశాడని తెలిపారు. తిరిగి ప్రస్తుతం అదే ధ్రువపత్రాన్ని చూపిస్తూ ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వెంటనే స్థల ప్రహరీని కూల్చివేసి ప్రభుత్వ స్థలంగా బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు వెల్లడించారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు చెత్త, వ్యర్థాలను తమ ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 3వ డివిజన్‌లలో తడి, పొడి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి తమ ఇళ్ల వద్దకు వచ్చే రిక్షా కార్మికులకు అందించాలని ఈ సందర్భంగా కమిషనర్ ప్రజలకు సూచించారు. తడి చెత్తను ఎరువుగా మారుస్తామని, పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం పంపిస్తామని వివరించారు. ఈ విషయంపై ప్రజలు మరింత అవగాహన పెంచుకొని బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, రామాంజులు, రాము, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈ-లెర్నింగ్ వర్క్‌షాప్


వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి ఈసీఈ విభాగం, పాంటెక్ ఈ లెర్నింగ్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఈ లెర్నింగ్ వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద, ఎంబెడెడ్ ఇంజినీర్, ఈసీఈ హెచ్‌ఓడీ రామాంజనేయులు మాట్లాడుతూ... ఇలాంటి వర్క్‌షాపులతో విద్యార్థినులకు పారిశ్రామిక, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. సర్క్యూట్ డిజైన్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీలో నైపుణ్యాలను పెంపొందుతాయన్నారు. పరిశ్రమలలో ఉపయోగించే సర్క్యూట్ డిజైనింగ్ టూల్స్, హ్యాండ్ ఆన్ డిజైనింగ్‌తో టూల్స్ ఇన్‌స్టాలేషన్, వినియోగం గురించి వివరించారు. అకడమిక్స్ డీన్ డాక్టర్ ఎస్.జగదీష్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్‌కుమార్, సహాయ ప్రొఫెసర్ దీపా పట్నాయక్ పాల్గొన్నారు.

గోల్ఫ్ చాంపియన్‌కు అభినందన


జెరూషా జెయిన్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

బండ్లగూడ: సౌత్ జోన్ గోల్ఫ్ చాంపియన్‌షిప్-2024లో ఎం.జెరూషా జెయిన్ ఉత్తమ ప్రతిభకనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఎం.జెరూషా జెయిన్ నార్సింగి సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతుంది. వైజాగ్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ గోల్ఫ్ చాంపియన్‌షిప్-2024లో ఎం.జెరూషా జెయిన్ ఉత్తమ ప్రతిభకనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను అభినందించి గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు.

రోడ్లు మంచిగా ఉంటేనే పురోగతి

- డ్రైనేజీల వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం
- మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి


ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలో రోడ్లు సరిగా ఉంటేనే ఆ పట్టణం అన్ని విధాలా ప్రగతివైపు పయనిస్తుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. 15వ వార్డు హనుమాన్ నగర్ కాలనీలో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ... రవాణా సౌకర్యం ఎంత బాగా ఉంటే అంత బాగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందినట్టుగా ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. అలాంటి రోడ్లతో పాటు డ్రైనేజీల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుకు సంబంధించిన పనులకు పెద్దపీట వేసి పనిచేస్తున్నామని వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమాన్‌నగర్, శ్రీలక్ష్మీప్రియ కాలనీలలో ఇప్పటికే రూ. కోటి వ్యయంతో డ్రైనేజీ పనులను పూర్తి చేయటంతో పెద్ద సమస్య తీరిందన్నా తెలిపారు. ఆ డ్రైనేజీ కోసం తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అందుకు అవసరమైన పనులు శరవేగంగా కొనసాగుతాయన్నారు. కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు బి.శ్రీరాములు, శ్రవణ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయాలి


పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

బండ్లగూడ: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు చక్కటి బాటలు వేయాలని గండిపేట మండల ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన పార్ట్ టూ ఆప్షనల్ పుస్తకాలను గురువారం ఆయన ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... తరగతి గదిలోని విద్యార్థులకు అర్థం అయ్యేలా విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు తోడ్పాటు అందించాలన్నారు. వారిని విద్యతో పాటు అన్ని రంగాలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు.

భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ నాణ్యతకు భరోసా


తాపీ మేస్త్రీలకు ప్రత్యేక కిట్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

శంషాబాద్: సిమెంట్ రంగంలో నాణ్యతలో భారతి అల్ట్రాఫాస్‌కు తిరుగులేదని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ అన్నారు. పట్టణంలోని రాళ్లగూడ మహాలక్ష్మీ ట్రేడ్ డీలర్ దుకాణంలో గురువారం రాత్రి మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ అనే విధాలా నాణ్యత ప్రమాణాలను అందిస్తుందన్నారు. ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయం కూడా చేస్తారన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లతో పాటు ప్రత్యేక కిట్లను భారతి సిమెంట్ ప్రతినిధులు అందజేశారు.

వాతావరణం చాలా కీలకం


ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం: వాతావరణం చాలా ముఖ్యమని, ప్రస్తుతం వివిధ రకాలుగా మారిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏఐసీ సీఈఓ రవి సర్కునన్ పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సోషల్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో కోహ్లీ రీసెర్చ్ బ్లాక్‌లో 'స్టార్టప్ ఇన్నోవేషన్ ఇన్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు పరిష్కార మార్గాలను అందించడంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రిటీష్ హైదరాబాద్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ, ఆర్ఐసీహెచ్, ఈపీఏఎం సిస్టమ్స్, స్టేట్ స్ట్రీట్స్, క్యాస్పియన్, ఐఈఈఎంఏ, కార్పొరేట్, పెట్టుబడిదారు, ఇంక్యుబేటర్ల ప్రతినిధులు, విద్యావేత్తలు, పర్యావరణ వ్యవస్థ వాటాదారులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ, వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. గురువారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. లింకురోడ్డు పనులు, మంజీరా పైపులైన్ రోడ్డు పనులు, శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని జడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. పార్కులు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. వెస్ట్ జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన జంక్షన్లు అభివృద్ధి చేసి ట్రాఫిక్ నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్ల విస్తరణలో స్థలం కోల్పోయిన బాధితులకు టీడీఆర్ త్వరగా ఇప్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, కేబుళ్ల మార్పిడిపై విద్యుత్ శాఖ, వర్షాకాలం వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వరద నివారణకు, రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఐటీ కారిడార్‌లో మెరుగైన వసతుల కల్పనకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, డీసీలు ముకుంద్ రెడ్డి, మోహన్ రెడ్డి, సురేష్, సుల్తానా, వెస్ట్ జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, టీజీఎస్‌పీడీసీఎల్, జలమండలి తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.